అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు ప్రజలు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్ సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డిఆర్ఒ వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారించి వారికి న్యాయం చేయాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు.

భారంగా పశుపోషణ!

- రైతులను వెంటాడుతున్న ఎండు గడ్డి కొరత
- యంత్రాల ద్వారా మాసూళ్లు
- ట్రాక్టర్ గడ్డి రూ.15 వేల నుంచి రూ.20 వేలు
- ఖర్చు ఎక్కువ దిగుబడి తక్కువ
- ఏడాదికి 12 లక్షల మెట్రిక్ టన్నుల గ్రాసం అవసరం

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

పశువుల పెంపకం రైతులకు భారంగా మారుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహం కరువవ్వడంతో కూలీల కొరత వేధిస్తోంది. ఎండుగడ్డి తగినంత లేకపోవడం, పచ్చిక బయళ్లు, ఖాళీ బంజరు భూములు తగ్గిపోవడం వంటి కారణాలతో పశువులకు మేత కరువవుతోంది. దీంతో పశుపోషణ రైతులకు భారంగా మారింది. పూర్వం ప్రతి రైంజూ కమతం గొడ్లశాల, గడ్డివాము, పాడి పశువులతో కళకళలాడేది. నేడు ఏ రైతు మకాం చూసినా కళ్లలు కళగా కనిపించట్లేదు. పల్లె ప్రజలు సైతం ప్యాకెట్ పాలపైనే ఆధారపడుతున్నారు. గతంలో ఓ సాధారణ రైతుకు వ్యవసాయంతో పాటు పశువుల పెంపకం ద్వారా అదనపు ఆదాయం చేకూరేది. గేదె పాలు ఇంటి అవసరాలకు పోను, మిగిలిన పాలు విక్రయించు కోవడం ద్వారా కుటుంబ పోషణ జరిగిపోయేది. పల్లె సీమలంటేనే పాడి పంటలకు నెలవు. అటువంటి పల్లెల్లో వ్యవసాయం కళ తప్పుతోంది..

పశువులను మేతకు తోలుకెళ్తున్న కాపరి

పశుగ్రాసం కొరత ఏర్పడటంతో..

జిల్లాలో తెల్లజాతి పశువుల కన్నా నల్లజాతి గోవులే అధికంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.39 లక్షల పాడి పశువులు ఉండగా వాటిలో 83 వేల గేదెలు, 56 వేల అవులు ఉన్నాయి. పంజాబ్ నుంచి ముర్రా జాతి గేదెలను ఎక్కువగా దిగుమతి చేసేవారు. ఒక గేదె లేదా ఆవుకు ఏడాది పొడవునా రెండున్నర ఎకరాల వరి చేలో గడ్డి అవసరం అవుతుంది. గేదె/ఆవు సరాసరిన 150 లీటర్ల వరకు పాలు ఇస్తుంది. కూలి రేట్లు పెరగడంతో వరి మసూళ్లను యంత్రాలతో చేపట్టారు. ఈ కారణంగా ఎండు గడ్డి దొరకట్లేదు. ఎకరం ఎండుగడ్డి మిషన్‌తో కోసిందయితే రూ.4 వేలు ఉంది. అదే కూలీలతో కోసింద్రైతే రూ.10 వేలుపైనే పలుకుతోంది ఒక గేదె/అవుకు ఎండుగడ్డి కోసం రూ.25 వేలు ఖర్చు అవుతుంది. పశువుల కాపరికి రోజు కూలిగా రూ.600 నుంచి రూ.700 వరకు చెల్లించాల్సి వస్తోంది. పచ్చిక భూములు, పుంత భూములు లేకపోవడంతో పశువులకు గ్రాసం కొరత ఏర్పడడంతో దాణాలపైనే ఆధారపడుతున్నారు. గేదె ధర రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఉండగా ఆవు ధర రూ.40 వేల నుంచి రూ.60 వేలు వరకు పలుకుతోంది. ఇంత ధర పెట్టి కొనుగోలు చేసినా పాలు దిగుబడులు లభించకపోవడంతో పాడి పరిశ్రమలు కనుమరుగవుతున్నాయని రైతులు నష్టపోతున్నారు. పాలుకు గిట్టుబాటు ధర లేకుండా పోయింది. పాడి పరిశ్రమకు పెద్దపీట వేస్తున్నామని చెప్పే ప్రభుత్వాలు కేవలం ప్రకటనలకే పరిమితయ్యాయనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

రాయితీలకు మంగళం

గతంలో సైలేజ్ గడ్డిని రైతులకు సబ్సిడీపై అందించేవారు. ప్రస్తుతం ఇవ్వట్లేదు. పశుక్రాంతి పథకం ద్వారా సన్న, చిన్న కారు రైతులకు పాడి పశువులకు రాయితీ అందించే పథకానికి మంగళం పాడేశారు. పాడి పరిశ్రమ ప్రోత్సాహానికి సంక్రాంతి పర్వదినాల్లో పాల పోటీలు, పశువుల అందాల పోటీలు నిర్వహించేవారు. నాలుగేళ్లుగా వాటి ఊసేలేదు. పశువులు మరణిస్తే బీమా వర్తించట్లేదు. పశు సమగ్ర క్షేత్రాలు, పశుగ్రాసం కోసం ఇచ్చే ప్రోత్సాహం నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పాడి పశువుల పెంపకం రైతులకు గుదిబండలా మారింది తద్వారా పశువుల సంఖ్య గణనీయంగా తగ్గి భవిష్యత్తులో పాడి పరిశ్రమ కనుమరుగై కృత్రిమ పాలు, ప్యాకెట్ పాలకే పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి ప్రభుత్వం మాత్రం ఇప్పుడు సైలేజ్ గడ్డి స్థానంలో టోటల్ మిక్స్ దాణా, సమీకృత దాణా అందిస్తోంది.

పొలాల్లో ఎండుగడ్డి తడిచిపోయింది

ప్రతి పంటలోనూ ఎండుగడ్డి మాసూళ్లు రైతులకు సవాల్‌గా మారుతోంది. ఒకవైపు పంట మాసూళ్లతో పాటు మరోవైపు పశువుల కోసం ఎండుగడ్డి మాసూళ్లు కత్తిమీద సాములా మారింది. తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు చాలాశాతం ఎండుగడ్డి పొలాల్లో తడిచిపో యింది. ఏడాదికి ఎండు పశు గ్రాసంగా సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నులు కావాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు మాసూళ్లు అయిన ఎండుగడ్డి నాలుగు నెలలకు మించి సరిపోదని రైతులు అంటున్నారు. గత పంటలో ట్రాక్టర్ ఎండుగడ్డి రూ.8వేలు ఉంటే ఈసారి రూ.10 వేల నుంచి రూ.12 వేలు వరకు అమ్ముతున్నారు. మిషన్ ద్వారా చుట్టిన మోపు రూ.35కు అమ్ముతున్నారు. తుఫాన్లు, ఆకాల వర్షాలతో ఏడాదిలో సగం గడ్డి మాత్రమే మాసూళ్లు అయ్యాయి.

పాడి పరిశ్రమను ప్రోత్సహించాలి

పాడి పశువుల పెంపకానికి ట్రాక్టర్ ఎండు గడ్డి గతంలో రూ.8 వేలు ఉంటే, ఇప్పుడు రూ.15 వేలు అయ్యింది. పశువులకు వాడే తవుడు గతేడాది 100 కిలోలు రూ.1,600 ఉంటే ప్రస్తుతం క్వింటాలు తవుడు రూ.3,200కి చేరింది. మొక్కజొన్న పిండి 50 కిలోలు రూ.650 ఉంటే రూ. 1,200కి పెరిగింది. జొన్నల ధర 100 కిలోలు రూ.1,600 నుంచి రూ.3,200కి పెరిగింది. దాంతో పాటు పశు గ్రాసాలు, కూలి రేట్లు పెరగడంతో పశువుల పెంపకం గిట్టుబాటు కావట్లేదు. పెరిగిన ముడిసరుకు, పశువుల దాణా ధరలు తగ్గించి పాడి పరిశ్రమను ప్రోత్సహించాలి.

-రామచంద్రారెడ్డి, పాడి రైతు, వేముల మండలం.

పశు పోషణ భారమవుతుంది

గ్రాసం ధర పెరిగింది. దీంతో పశుపు పోషణ భారం అవుతుంది. వ్యవసాయంలో నష్టాలు వస్తుండడంతో ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమ ఎంచుకున్నాం. ఎనిమిది సంవత్సరాల నుంచి నాలుగు పాడి పశుపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాం. పశువుల పోషణకు నెలకు ఒక ట్రాక్టర్ వరిగడ్డి రూ. 20 వేలు ఖర్చు అవుతుంది. పశుగ్రాసం ధర విపరీతంగా పెరగడం వల్ల పశువుల పోషణ భారం అయిందని వాటిని అమ్మడానికి నిర్ణయించుకున్నామన్నారు.

-వి.రాము, కర్ణ పాపాయపల్లి, లింగాల మండలం.

రాయితీపై దాణా ఇవ్వాలి

పశుగ్రాసం కొందమంటే ఒక ట్రాక్టర్ వేరుశనగ కట్టె రూ.25 వేలు పైగా ధర చెబుతున్నారు. గ్రాసం కొని జీవాలు మేపే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం స్పందించి పశుపోషకులకు రాయితీపై దాణా పంపిణీ చేయాలి.

- గంగిరెడ్డి, పాడి రైతు, పులివెందుల.

విద్యార్థులతో సిఇఒ శ్రీదేవి

ఆధునిక విద్యలో ప్రాచీన విజ్ఞానం వేదిక్ మ్యాథ్స్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆధునిక విద్యలో ప్రాచీన విజ్ఞానం వేదిక్ మ్యాథమేటిక్స్ అని సాయిబాబా విద్యాసంస్థల సిఇఒ, కార్పొరేటర్ శ్రీదేవి అన్నారు. సోమవారం అక్కాయపల్లెలోని సాయిబాబా విద్యాసంస్థలో వేదిక మ్యాథమేటిక్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణితంపై ఆసక్తి పెంచేందుకు వేదిక్ మ్యాథమేటిక్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తక్కువ సమయంలో క్యాలుకేలేషన్ సులభంగా పూర్తి చేసే అవకాశం ఇందులో వీలవుతందని చెప్పారు. పరీక్షల్లో సమయం ఆదా అవుతందని తెలిపారు. గణితంపై ఉన్న భయాన్ని పోగొట్టుడుతుందని అన్నారు. తమ విద్యా సంస్థలో వేదిక్ మ్యాథమేటిక్స్ ప్రవేశపెట్టామన్నారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్ అందజేసి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కెఎస్ఆర్ఎంలో..** ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞులు శ్రీనివాస రామానుజం జయంతిని కెస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సోమవారం జాతీయ గణితం దినోత్సవం సందర్భంగా రామానుజం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.ఎన్. ప్రసాద్, కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గణితం కేవలం అంకెలో కూడుకున్నది మాత్రమేగాక సృజనాత్మక ఆలోచనలకు, కళాత్మక ఆవిష్కరణకు పునాదిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్అండ్ ఎస్ ఇన్‌ఛార్జి విభాగాధిపతి మేరీ జాస్మిన్, సివిల్ హెచ్ఒడి డాక్టర్ చెన్నకేశవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **వల్లూరు:** మండలంలోని వేదాస్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ ధీరజ్ మాట్లాడుతూ విద్యార్థులు గణిత శాస్త్రంపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. గొప్ప గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన గణిత సూత్రాలు, వివిధ ఆకృతుల నమూనాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు పవన్ కుమార్ రెడ్డి, ఇతర ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. **బద్వేలు :** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని గణిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించేందుకు రంగవల్లులు, టిఎల్ఎం మేళా, క్విజ్, డ్రాయింగ్ వంటి వివిధ పోటీ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరంఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎ. రామయ్య, జకరయ్య, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ జి. భారతి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నేడు పులివెందులకు జగన్ రాక

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పులివెందులకు వస్తున్నట్లు తాడిపల్లి కార్యాలయ వ్యక్తిగత నాగేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో మూడు రోజుల పాటు పులివెందుల నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 23న మధ్యాహ్నం 4 గంటలకు బెంగళూరు నుంచి హెలికాప్టర్ ద్వారా పులివెందులకు చేరుకుంటారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి తన నివాసంలో బస్తా చేస్తారు. 24న ఉదయం రోడ్డు మార్గాన ఇడుపులపాయకు చేరుకుని ప్రార్థన మందిరంలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థన చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు పులివెందులకు చేరుకుని క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. రాత్రి పులివెందులలోని తన నివాసంలో బసచేస్తారు. 25న ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు బాక్రాపురంలోని హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో బెంగుళూరుకు బయలుదేరుతారు.

కెవి స్కూల్‌లో క్రిస్మస్ కానుక పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : క్రిస్మస్, నూతన సంవత్సరం పురస్కరించుకుని పి.ఎం.శ్రీ కేంద్రీయ విద్యాలయ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ ఆధ్వర్యంలో తల్లిందడ్రులు సోమవారం క్రిస్మస్ కానుక పంపిణీ చేశారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, కార్మికులు, డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. పెన్నులు, కేకులు, పండ్లు అందజేశారు.కెవిలో పని చేస్తున్న 4 ఆయాలకు చీరలు బహుకరించారు. మధ్యాహ్నం కెవి కార్మికులకు, డ్రైవర్లకు భోజనం అందించారు. ఒకరికొకరు శుభాక్షాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమానికి ఆల్ జియా ఉల్ సక్లైస్ చారిటబుల్ ట్రస్ట్ సహకారం అందించారు. పేరెంట్స్ అసోసియేషన్ కోశాధికారి జితేంద్ర, సంయుక్త కార్యదర్శి శాంసన్ అనిల్, మహిళా విభాగం కన్వీనర్ చంద్రకళ, కె.వి. బస్ రూట్ 1 కమిటీ అధ్యక్షులు రమేష్‌బాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్‌సిఎం చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న ఆర్‌సిఎం చర్చిలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ వర్గాల నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. అమీర్‌బాబు, సలావుద్దీన్, ఫకృద్దీన్‌ను శాలువాతో సత్కరించారు. కేక్ కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చర్చి ఫాదర్లు బి.జ్వానేష్, సిస్టర్స్ సరీనా, సుజాత ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అష్రఫ్ అలీఖాన్, మునిరాజు, స్వామినాథం, అబ్దుల్లా, రెహమాన్, నాసర్ అలీ, దేవర కృష్ణ, కె.వి.రమణ, ప్రభాకర్, నాగమునెయ్య, సాల్మాన్ పాల్గొన్నారు.

కార్మికుడిని పరామర్శించిన మేయర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : పబ్లిక్ హెల్త్ విభాగంలో అడిషనల్ వర్కర్‌గా పని చేస్తున్న వెస్ట్‌జోన్ కంపోస్టు డ్రైవర్ రవి ప్రమాదానికి గురయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవిని సోమవారం మేయర్ పాకా సురేష్‌కుమార్ పరామర్శించారు. చికిత్స అందిస్తున్న డాక్టర్ విజయ భాస్కర్‌రెడ్డితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వాసు, మున్సిపల్ యూనియన్ నాయకులు సుంకర రవి, కిరణ్, మస్తాన్, శివ, కొండయ్య, నరసింహులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల కష్టాలు విస్మరించిన

కూటమి ప్రభుత్వం

హామీల అమలుకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి
ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

ప్రజాశక్తి-జమ్మలమడుగు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎన్నికల్లో అనేక హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇంతవరకు వారి సమస్యలు పరిష్కరించేలేదని, హామీల అమలుకు చేనేత కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 4వ జిల్లా మహాసభలు సోమవారం జమ్మలమడుగు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయం నుంచి నాగులకట్టవీధి చక్ర ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం మహాసభల ప్రారంభ సూచికంగా జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమ చేనేత అన్నారు. అటువంటి పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని వాపోయారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో చేనేత కార్మికులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అనేక హామీలిచ్చిందని, ముఖ్యంగా చేనేతలకు 200 యూనిట్లు ఉచిత కరెంట్ ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అది ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని వాపోయారు. రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని రంగాలకు అధిక నిధులు కేటాయించి చేనేత రంగానికి రూ.200 కోట్లు కేటాయించామని ఆర్భాటాలు చేస్తున్నారని విమర్శించారు. అది ఏమాత్రం సరిపోదని, రూ. 20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ఇంటి స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో కార్మికుల ఖాతాలో నగుదు వేశారని, ఆ డబ్బులు పేద కుటుంబాలకు ఉపయోగపడేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయలేదని పేర్కొన్నారు. బోగస్ సొసైటీలను కొంత మంది స్వార్థపూర్తి రాజకీయ నాయకులు పెంచి పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా రూ. కోట్లు నిధులు దారిమళ్లిస్తున్నారని పేర్కొన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాబోవు రోజుల్లో రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, కార్యదర్శి సత్యనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివనారాయణ, ఓబులేసు, జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

'ఉపాధి'ని యథావిధిగా కొనసాగించాలి

-జీ రామ్ జీ బిల్లును ఉపసంహరించుకోవాలి
- సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్ర
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ఆందోళన చేస్తున్న వాపమక్ష నేతలు

ప్రజాశక్తి - కడప అర్బన్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కొనసాగించాలని, జీ - రామ్- జీ బిల్లు ఉపసంహరించుకోవాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు జి.చంద్రశేఖర్, జి.చంద్ర డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఆందోళన చేట్టారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులతో పాటు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఓబయ్య, సిపిఐ ఎంఎల్ రమణయ్య, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శులు అన్వేష్, చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులు, కూలీలకు చేసిన ఘోర నమ్మక ద్రోహం ఉపాధి హామీ చట్టంలో మార్పులని పేర్కొన్నారు. ఉపాధి హక్కును రద్దు చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ ఆమోదించడం దుర్మార్గమని తెలిపారు. రాజకీయ భేదాలు పక్కనపెట్టి ఐక్య పోరాటాలతో పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో రామమోహన్, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, చంద్రారెడ్డి, వెంకటశివ, బాదుల్లా, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, మద్దిలేటి పాల్గొన్నారు.

అత్యున్నత ప్రమాణాలతో శిక్షణ : ఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్ : కొత్తతరం పోలీసింగ్‌కు అనుగుణంగా అనుభవజ్ఞులైన పోలీస్ అధికారులు ఇచ్చే శిక్షణను ట్రైనీ కానిస్టేబుళ్లు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పి షెల్కే సచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం నగర శివారులోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో అనంతపురా జిల్లాకు చెందిన సివిల్ ట్రైనీ కానిస్టేబుళ్లు 194 మందికి, 11వ బెటాలియన్ శిక్షణ కేంద్రంలో ఎపిఎస్‌పికి ఎంపికైన కానిస్టేబుళ్లు 330 మందికి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆయన శిక్షణకు హాజరైన కానిస్టేబుళ్లకు అభినందనలు తెలిపారు. వారికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అభ్యర్థులకు అత్యున్నత ప్రమాణాలో కూడిన మౌలిక సదుపాయాలను డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఏర్పాటు చేశారని చెప్పారు. ఫిట్‌నెస్‌పై శ్రద్ధ వహించాలని సూచించారు. శిక్షణలో భాగంగా ఎక్కడైనా అర్థం కాని పక్షంలో మరో సారి అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో 11వ బెటాలియన్ కమాండెంట్ కె. ఆనందరెడ్డి, అదనపు ఎస్‌పి కె. ప్రకాష్‌బాబరు, కడప డిఎస్‌ఫి వెంకటేశ్వర్లు, నగరంలోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గుంటూరు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సలావుద్దీన్

వక్ఫ్ భూముల ధారాదత్తం దుర్మార్గం

- ముస్లిమ్ సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సలావుద్దీన్

ప్రజాశక్తి-కడప అర్బన్

గుంటూరు జిల్లాలో వక్ఫ్‌బోర్డు భూమిని ముస్లిముల అభ్యున్నతి, అభివృద్ధికి ఉపయోగించకుండా ఏక పక్షంగా రూ.1000 కోట్లు విలువ చేసే స్థలాన్ని ధారాదత్తం చేయడం దుర్మార్గమనిముస్లిమ్ సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సలావుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం గుంటూరు కలెక్టర్ తమిమ్ అన్సారీకి రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గం చినకాకాని గ్రామంలో వక్ఫ్‌భూమిలో పారిశ్రామిక, ఐటి పార్క్ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. 71.57 ఎకరాలు వక్ఫ్‌భూమిలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఈ ఏడాది జనవరి 24న చేసిన ప్రతిపాదనపై ముస్లిమ్ సమైక్య వేదిక తీవ్రంగా వ్యతిరేకిస్తుంని చెప్పారు. ప్రజాప్రయోజనం అనే ముసుగులో రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులను హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విస్తారమైన ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నప్పటికీ వక్ఫ్‌భూమిని లక్ష్యంగా చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భేషరత్తుగా ఉపంహరించుకోవాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సమైక్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

ప్రజాశక్తి -కాశినాయన : మండలంలోని ఓబుళాపురం గ్రామం సమీపంలో సగిలేరు నది ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో సేదతీరుతూ మరణించిన చెన్నమ్మ అనే అనాథ వృద్ధరాలికి వివేకానంద ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు అంత్యక్రియలు నిర్వహించారు. పోరుమామిళ్ల పట్టణానికి చెందిన చెన్నమ్మకు ఉన్న ఒక్క కుమారుడు మరణించాడు. అయినవారులేక అవస్థలు పడుతూ దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆమెను వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి అక్కున చేర్చుకుని సేవలు అందించేవారు. సోమవారం చెన్నమ్మ మరణించడంతో సంస్థ ప్రతినిధులు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించి మానవతను చాటుకున్నారు.

యుటిఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు

ప్రజాశక్తి-కడప అర్బన్

విజయ్‌కుమార్

మహేష్

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీని ఆదివారం మైదుకూరు పట్టణంలోని డిసిఎల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎన్. నాగార్జునరెడ్డి, జిల్లా అధ్యక్షులుగా మాదన విజయ్ కుమార్, సహ అధ్యక్షులుగా వై. రవికుమార్, బి. సుజాతారాణి, ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, కోశాధికారిగా కె. నరసింహారావు, కార్యదర్శులుగా చెన్నయ్య, సి.వి. రమణ, ఎస్. ఏజాస్ అహ్మద్, వి.మురళీకృష్ణ, ఎ. శ్రీనివాసులు, కె. సుధాకర్, కె. ప్రసాద్, ఎస్. షకీలాబేగం, డి. సుబ్బారావు, జి. గోపీనాథ్, ఎస్. ఫయాజుద్దీన్, సి. సుదర్శన్, ఏ.డి.దేవదత్తం, జె. వెంకట రత్నం, ఎం. శ్రీనివాసులు, కంబగిరి ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పాలెం మహేష్‌బాబు, మాదన విజయ్‌కుమార్, పలువురు ఎన్నికయ్యారు.

ఉపాధి చట్టానికి పేరు మార్చడం దారుణం

ప్రజాశక్తి-కడప

కేంద్రంలోని మత విద్వేష ప్రధాని నరేంద్రమోడీ మహాత్మగాంధీ ఉపాధి చట్టానికి పేరు మార్చి విబిజిఆర్ఎ ఎంజి అనే కొత్త పథకాన్ని తీసుకురావడం దారుణమని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహ్మద్‌అలీఖాన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా అలీఖాన్ మాట్లాడుతూ ఉపాధి చట్టాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకే కుట్రపన్నుటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కొత్త పథకాన్ని నిలిపేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మయాన రహమతుల్లాఖాన్, కాంగ్రెస్ నాయకులు హమీద్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కమల్‌బాష, రఫీక్‌ఖాన్ పాల్గొన్నారు.

కెసిఆర్‌కు మతిభ్రమించింది

ఎన్ఆర్ఐ టిడిపి కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న రహమతుల్లా

రాష్ట్రం విడిపోయి 12 సంవత్సరాలు అవుతున్నా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎన్ఆర్ఐ టిడిపి కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా అన్నారు. సోమవారం మార్కెట్ యార్డ్ సమీపంలోని ఎన్ఆర్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని విమర్శించకుండా కెసిఆర్‌కు రోజులు గడవండం లేదని పేర్కొన్నారు. చంద్రబాబు లేకపోతే కెసిఆర్ ఎక్కడ ఉండేవారో ఆలోచించుకోవాలని తెలిపారు. తెలంగాణాను 10 సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ సోది కబుర్లు చొపుతున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ వల్ల పాలమూరుకు నష్టమని చెప్పడం సమంజసం కాదన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కెసిఆర్ ఫాం హౌస్‌కు పరిమితమై ఇప్పుడు చంద్రబాబునాయుడుపై విమర్శలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని పేర్కొన్నారు. సొంత కూతురుని కంట్రోల్ చేయలేని కెసిఆర్ ఇక రాష్ట్రాన్ని ఏమి చేస్తారని ప్రశ్నించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ, ఆయన సతీమణి ఉమాదేవి

పేదల ఆరోగ్యానికి అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఆయన 47 మందికి రూ.22.57 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స ఖర్చులు భరించలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో దోహదపడుతుందన్నారు. పేదల ప్రజలకు కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సిఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందేలా ప్రజాప్రతినిధులుగా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబ సభ్యులు రాంగోపాల్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సతీమణి ఉమాదేవి, టిడిపి నాయకులు బొజ్జ మైసూరారెడ్డి, తాళ్ళపల్లి వేంకటేశ్వర రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, ముచ్చుమర్రి మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై మోడీ వ్యాఖ్యలు హాస్యాస్పదం

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్‌పై ప్రధాని వ్యాఖ్యలు హాస్యాస్పదనమి పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశ వ్యతిరేకి అని అనడం శోచనీయమన్నారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులు అస్సాంలో స్థిరపడేందుకు కాంగ్రెస్ అన్ని విధాలా సాయం చేస్తోందని, రైతులను విస్మరించిందని మోడీ పేర్కొనడాన్ని ఆయన తప్పుపట్టారు. భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రసాదించడం దేశ వ్యతిరేకమా అని ప్రశ్నించారు. నవభారత నిర్మాణం, హరిత విప్లవం, పారిశ్రామిక విప్లవం, సమాచార, ఎలక్ట్రానిక్ విప్లవాలు తేవడానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందన్నారు. రైతులకు పలు పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. టిడిపికి బడుగు, బలహీన వర్గాలపై చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ అధ్యక్ష పదవినిగానీ, సిఎం పదవినిగానీ వారికి కేటాయిం చాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్ర మణ్యం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు పాల్గొన్నారు.

అనుమతుల్లేని ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

అనుమతుల్లేని ఎరువులను అమ్మితే చట్టపరమైన చర్యలు తీసు కుంటామని మైదుకూరు ఎఒ బలగంగాధర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం వనిపెంటలోని ఇర్షాద్ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో అనుమతిలేని ఎరువులను అమ్మకాలు చేపట్టినట్లు రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు కంపెనీల ఎరువులను గుర్తించారు. వీటికి సంబంధించి బిల్లులు చూపాలని అడగ్గా, యజమాని అందుబాటులో లేవన్నారు. మూడు రోజుల్లో బిల్లులు చూపకపోతే చట్టపరమైన చర్యలు తీసు కుంటామని, దుకాణాన్ని సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాని తనిఖీ చేస్తున్న ఎఒ బాలగంగాధర్‌రెడ్డి

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని సుంకేసుల గ్రామానికి చెందిన చెన్నూరు శివ ప్రసాద్ రెడ్డి విద్యుదాఘాతానికి గురై సోమవారం మృతి చెందాడు. గ్రామస్తులు వివరాల మేరకు.. శివప్రసాద్‌రెడ్డి మేస్త్రీ పని చేసుకుని జీవనం సాగించేవాడు. రోజూ లాగే నాగపట్నం వద్ద పనికి వెళ్లాడు. అక్కడ ఓ భవనానికి మౌస్ వేస్తుండగా విద్యుత్ ప్రమా దానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసు కెళ్తుండగా మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు కావాల్సి ఉంది.

మృతి చెందిన శివప్రసాద్‌రెడ్డి

చిలమకూరులో పట్టపగలే చోరీ

- 21 తులాల నగలు అపహరణ, సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని చిలమకూరులో పట్టపగలే చోరీ జరిగిన సంఘటన చోటు చేసుకుంది. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి తొమ్మిదిన్నర గంటల మధ్యంలో చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. రమేష్ శెట్టి అనే వ్యక్తి కొండారెడ్డి కాంప్లెక్ వెనుక వీధిలో నివాసముంటున్నాడు. ముద్దనూరు రోడ్డులో నాలుగు రోడ్ల కూడలి సమీపంలో సరుకుల అంగడి నిర్వహిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం రమేష్ ఇంటికి బంధువులు రావడంతో, వారు సాయంత్రం వెళుతున్న క్రమంలో భార్యతో కలిసి రమేష్ కూడా అంగడి వద్దకెళ్లాడు. మళ్లీ రాత్రి 9.30 సమయంలో అంగడి మూసి, ఇంటికి చేరుకోగా తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉంది. అందులోని నగలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆయనతోపాటు జమ్మలమడుగు సిఐ నరేష్‌బాబు ఉన్నారు. క్లూస్ టీంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులతో మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకటేశ్వరరావు

వరి రైతుకు భారంగా నూర్పిడి యంత్రాలు

ఎకరాకు రూ.5 వేల వరకు ఖర్చులు - దిక్కుతోచని స్థితిలో రైతులు

ప్రజాశక్తి - చాపాడు

అరకొర గిట్టుబాటు ధరలతో, పెరిగిన సాగు ఖర్చులతో అల్లాడిపోతున్న వరి రైతులను నూర్పిడి యంత్రాల నిర్వాహకులు నిలువునా ముంచుతున్నారు. కూలీలతో వరి పంట నూర్పిడి చేయాలంటే అధిక సమయం, ఎక్కువ ఖర్చులు అవుతాయని వరి కోత యంత్రాలపై రైతులు ఆధారపడుతున్నారు. ఇదే అదనుగా వరి కోత యంత్రాల నిర్వాహకులు రైతులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారు. గంటల ప్రకారం నూర్పిడి పనులను చేపడుతున్నారు. పొలాల్లో తేమ శాతం అధికంగా ఉండడంతో టైర్ల మిషన్ల ద్వారా నూర్పిడి సాధ్యపడడం లేదు. టైర్ల మిషన్లకు గంటకు రూ.2వేలు కాగా, చైన్ల మిషన్లకు గంటకు రూ.3,200 నుంచి రూ.3,400 వరకు వసూలు చేస్తున్నారు. ఎకరా పొలాన్ని 1.30 గంటల నుంచి 2 గంటల వరకు నూర్పిడి సమయం పడుతోంది. నేలకొరిగిన వరి పంట మరింత ఆలస్యం అవుతుందని రైతులకు పేర్కొంటున్నారు. దారులు లేని రైతులు వరి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అదనంగా ట్రాక్టర్లను బాడుగకు ఉపయోగించాల్సి ఉంది. ఎకరా వరి పంట నూర్పిడి చేసేందుకు రూ.6వేల వరకు ఖర్చులు అవుతున్నాయని రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం వరి ధాన్యం విలువ పుట్టి (8బస్తాలు) కేవలం రూ.11,500 మాత్రమే. ఎకరాకు 28 నుంచి 32 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం వరి కోత యంత్రాలకే రూ.5,000 వరకు ఖర్చులు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. వరి పంట సాగు రూ.30 నుంచి రూ.35 వేల వరకు ఖర్చు అవుతుందని పేర్కొంటున్నారు. వరి కోత యంత్రాలను అధికంగా తమిళనాడు ప్రాంతం నుంచి మన జిల్లాకు తీసుకొచ్చారు. వరి కోత యంత్రాల వారి నుంచి మన ప్రాంతానికి చెందిన దళారులు గంటకు రూ.300 నుంచి రూ.500 వరకు కమీషన్ తీసుకుంటూ రైతులపై అధిక భారాలు మోపుతున్నారు. వరి కోత యంత్రాల యజమానులు కూడా గతంలో గంటకు రూ.2000 ఉన్న ధరను అమాంతం పెంచి రూ.3 వేలకు పెంచారని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధరలు కూడా నామమాత్రంగా ఉన్నాయి. ఈ సమయంలో వరి కోత యంత్రాలు అధికంగా వసూలు చేయడం దారుణమని రైతులు ఆవేదన చెందుతున్నారు. జిల్లా వరి ధిలో వందలాది వరి కోత యంత్రాలు తమిళనాడు నుంచి మన ప్రాంతానికి వచ్చాయి. స్థానికంగా వరి కోత యంత్రాలు లేకపోవడంతో తమిళనాడు ప్రాంతాల్లో వరి కోత యంత్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అదునుగా దళారులు రైతులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారు. గతంలో వరి కోత యంత్రాల యజమానులకు కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి రైతులపై భారాన్ని తగ్గించాలని ధరలను నిర్ణయించి, నిబంధనలు విధించారు. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో దళారులు ఇష్టానుసారంగా ధరను నిర్ణయించి రైతులను దోచుకుంటున్నారు.

ఎకరా నూర్పిడికి ఒకటిన్నర గంట పట్టింది

ఎకరా వరి పంట నూర్పిడికి ఒకటిన్నర గంట సమయం పట్టింది. గంటకు రూ.3,200 ప్రకారం ఖర్చు వస్తుంది. వరి కోత యంత్రాలకే అధిక ఖర్చులవుతున్నాయి. ఎడతెరిపిలేని వర్షం కారణంగా వరి పంట నేలకొరిగడంతో నూర్పిడి ఆలస్యం అవుతోంది. ఇదే అదనుగా వరి కోత యంత్ర యజమానులు అధికంగా వసూలు చేస్తున్నారు. స్థానికంగా వరి కోత యంత్రాలు అందుబాటులో ఉంటే రైతులపై భారం తగ్గుతుంది.

- వీరారెడ్డి, రైతు, సిద్దారెడ్డిపల్లె

స్థానికంగా యంత్రాలు అందుబాటులో లేవు

మన ప్రాంతానికి సంబంధించిన వరి కోత యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో తమిళనాడు యంత్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. వారు నిర్ణయించిన ధరనే చెల్లించాలి. వర్షానికి వరి పంట నెలకొరిగితే పంట నూర్పిడి ఆలస్యం. సాధారణంగా ఎకరాకు ఒక గంట సమయం చాలు. వరి కోత యంత్రాలతో ఎకరాకు రూ.5వేలు వరకు ఖర్చు వస్తుంది. ప్రభుత్వం సబ్సిడీ వరి కోత యంత్రాలు అందుబాటులో ఉంచితే ఉపయోగకరంగా ఉంటుంది.

- జయసుబ్బారెడ్డి, రైతు, రాజువారిపేట

యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఆర్కేవ్యాలీ విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయి ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ టోర్నమెంట్‌కు ఇడుపులపాయి ఆర్కేవ్యాలీ విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా తెలిపారు. ఇంటర్ క్యాంపస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమ వారం డైరెక్టర్, ఎఒ పెనుకొండ రవికుమార్ అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమార స్వామి గుప్తా మాట్లాడుతూ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ క్రీడా పోటీల్లో అన్ని విభాగాల్లోని క్రీడాల్లో ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటి విద్యార్థులు ప్రతిభ చూపారని తెలిపారు. ఆర్జీయూకేటీ యూనివర్సిటీ తరుపున జనవరిలో కేరళ రాష్ట్రంలో జరిగే కేరళ యూనివర్సిటీ, ఆంధ్ర యూనివర్సిటీ, సత్యభామ యూనివర్సిటీల్లో జరిగే క్రీడాల్లో తమ కళాశాల విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఇంటర్ యూనివర్సిటీలో జరిగే క్రీడాల్లో విద్యార్థులు ప్రతిభ చూపి ఆర్కేవ్యాలీ క్యాంపస్ పేరును నిలబెట్టాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులను అభినందించిన వారిలో వ్యాయామ విద్యా విభాగానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్లు పి.వి.రమణారెడ్డి, బాల ఓబయ్య, షంషాద్ బేగం పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

రక్తదానంతో ఆరోగ్యం మెరుగు

రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రక్తదానం వల్ల ఆరోగ్యం మెరుగు పడుతుందని రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్ ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం సురక్ష వాలంటరీ బ్లడ్ సెంటర్ ప్రొద్దుటూరు సహకారంతో కళాశాల ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కరస్పాండెంట్ ఎల్.తరునేంద్ర శేఖర్, ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రక్తదానంతో ఇతరుల ఆరోగ్యాన్ని కూడా కాపడిన వారవుతారని, ప్రతి ఒక్కరు రక్తదానానికి ముందుకు రావాలన్నారు. కరస్పాండెంట్ తరునేంద్ర శేఖర్ మాట్లాడుతూ రక్తదానం గొప్ప వరమన్నారు. యువత సేవాభావం కలిగి ఉండాలని సూచించారు. రక్త దానం చేసిన 40 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థులను ప్రశంసిస్తూ వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి, సురక్ష వాలంటరీ బ్లడ్ సెంటర్ ఆర్గనైజర్స్, కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్

రామానుజన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా సోమవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రాముడు మాట్లాడుతూ రామానుజన్ అతి చిన్న వయసులోనే గణితంలో ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తగా పేరు పొందరాన్నారు. ఆయన సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఆనందరావు, శ్రీను, రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వేంపల్లె

గణిత నిపుణులు రామానుజన్ జయంతి వేడుకలను మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల, ట్రిపుల్‌ఐటి, వికాస్, ఉషాకిరణ్, శ్రీచైతన్య, శ్రీనివాస, స్వామి వివేకానంద పాఠశాలల్లో రామానుజన్ చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

మౌలిక సదుపాయాలు సమకూరక.. ఇబ్బందులు తొలగక

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో గ్రామాల్లో కనీస సదుపాయాలు సమకూరడం లేదు. సరైన రహదారులు, శ్మశాన వాటికలు, మంచినీరు వంటి అనేక సమస్యలు ఇప్పటికీ ప్రజలను పట్టి పీడిస్తూనే ఉన్నాయి. వివరాల్లోకెళ్తే.. దుంపలగట్టు సమీపంలో గత ప్రభుత్వం జగనన్న కాలనీ ఏర్పాటు చేసింది. కాలనీ ఏర్పాటు జరిగి ఏళ్లు తరబడి అవుతున్నా ఆ కాలనీలో మౌలిక సదుపాయాలు సమకూర లేదు. సరైన రహదారులు, వీధి దీపాలు లేక, శ్మశానాలు, మురుగు కాలువలు వంటి అనేక సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. ఇప్పటికీ సరైన సదుపాయాలు లేకపోవడంతో చాలామంది అక్కడ ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం స్పందించి జగనన్న కాలనీలో సమస్యలపై ప్రత్యేకదృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారికి నోచుకోని జగనన్న కాలని

తడిపొడి చెత్తను పరిశీలిస్తున్న జడ్‌పి సిఇఒ ఓబులమ్మ

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాలు దరి చేరవని జడ్‌పి సిఇఒ ఓబులమ్మ తెలిపారు. ఓబులాపురం గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన శానిటేషన్ కార్యక్రమంలో సిఇఒ మాట్లాడుతూ పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. రోడ్లపై వ్యర్థాలు, చెత్త, మురుగునీరు వేయకూడదన్నారు. తడి, పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు డిఎల్‌డిఒ, ఎంపిడిఒ రాధాకృష్ణవేణి పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న జిల్లా ఉపవైద్య అధికారి, వైద్య సిబ్బంది

గ్రామాల్లో ఫీవర్, లార్వా సర్వే తప్పనిసరి

ప్రజాశక్తి - వేముల

ప్రతి ఆశా, ఆరోగ్య కార్యకర్త గ్రామాల్లో ప్రతిరోజూ ఫీవర్, లార్వా సర్వే చేయాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి ఖాజా మొద్దీన్ సూచించారు. వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఖాజా మౌనిద్దీన్ డెంగీ వ్యాధి అవగాహన నిమిత్తం ఆశా కార్యకర్తలకు పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామాల్లో జ్వరాలు ఉంటే వెంటనే డాక్టర్, సూపర్‌వైజర్‌కు తెలియజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వేముల వైద్యాధికారి డాక్టర్ శరణ్యరెడ్డి, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్యదర్శితో మాట్లాడుతున్న రామమునిరెడ్డి

స్వర్ణ పంచాయతీ పనులను వేగవంతం చేయండి

ప్రజాశక్తి - వేంపల్లె

స్వర్ణ పంచాయతీల పనులను వేగవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి సూచించారు. సోమవారం వేంపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డితో అభివృద్ధి పనులపై ఆయన చర్చించారు. పంచాయతీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి సమస్యలపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆయన కోరారు. ఇంటి పన్ను, నీటిపన్ను ఆన్‌లైన్ ద్వారానే ప్రజల నుంచి వసూలు చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు వీరభద్ర పాల్గొన్నారు.

హకీం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

హకీం మృతికి పలువురి నివాళులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మైనార్టీ నేత హకీం మృతికి సోమవారం పలు రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. ఆయన ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, వైసిపి మైనార్టీ మండల కన్వీనర్ మునీర్, ఇతర నాయకులు హకీం మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

తాగునీటి పైపులు లీకేజీ

ప్రజాశక్తి-వేంపల్లె

వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో జలజీవన్ పథకంలో భాగంగా తీసిన గుంతలతో తాగునీటి పైపులు పగిలిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. జలజీవన్ పథకం కింద తాగునీటి పైప్‌లైన్‌లు వేసేందుకు గతనెల కిందట గాంధీరోడ్డు నుంచి మెయిన్ బజార్ వరకు రోడ్డును తవ్వారు. అనంతరం రహదారిలో ఇళ్లకు సంబంధించిన తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయాయి. జలజీవన్ పథక అధికారులు కూడా పైప్‌లైన్ వేయకుండా వదిలేయడంతో పగిలిన పైప్‌ల నుంచి రోడ్డు వెంబడి నీరు వృథాగా పోతోంది. పైప్‌లు మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు స్థానికులు విన్నవిస్తున్నా, ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోవడంలేదు. తాగు నీరు వృథాతోపాటు ప్రజలకు ఇబ్బంది కలిగేలా రోడ్డు వెంబడి కాలువల్లా నీరు పారుతోంది. అంతే కాక ఇళ్లకు కూడా సరిగా నీరు ఎక్కడం లేదని, తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. మోటర్లు వేసినప్పుడు మురుగు నీరంతా తాగు నీటి పైప్‌లోకి వస్తోందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మహారాజశ్రీ కోవెలకుంట్ల సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O. S. No. 248/2023

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు,
రేప్రజెంటెండ్ బై బ్రాంచ్ మేనేజర్, నొస్సం ... వాది

V/S

యేరాసి భరత్ రెడ్డి,
S/o. Y. పుల్లారెడ్డి, హిందూ,
వయస్సు 25 సం॥,
వృత్తి వ్యవసాయం,
R/o. భీమ గుండం గ్రామం,
పెద్దముడియం మండలం, వైయస్సార్ కడప జిల్లా,
ఆంధ్రప్రదేశ్. ... ప్రతివాది నెం. 1

ప్రతివాది నెం. 1 కు దావా సమను కొరకు

పై కేసు నెంబరు లో పై కోర్టులో దావా దాఖలు చేసి పలుమార్లు నీకు దావా సమను పంపినప్పటికీ నీకు ముట్ట నందున పై దావాలో నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల నీవు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని 09-01-2026 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పైకోర్టులో హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేని యెడల పై దావాని విచారించి మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : **09-01-2026**

ఎస్. చంద్రశేఖర్ రెడ్డి,
ఎం. ఓబులేసు,
అడ్వకేట్స్,కోవెలకుంట్ల.
సెల్ నెం . 9666569666